# గమ్యంలేని పయనం

-కేతిరెడ్డి యాకూబ్ రెడ్డి

ఇంకా తెల్లవారలేదు.

ఐదూ ఐదున్నర అవుతుందనుకుంటా.

డోర్ క్రింద నుండి దినపత్రిక సరసరా పాకుతున్న శబ్దం. అలా పాక్కుంటూ పాక్కుంటూ వచ్చి తన రెండు చేతుల్తో నన్ను విప్పి తిరగేస్తుంది.

-ఐదేళ్లలోపు రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలిస్తా- ముఖ్యమంత్రి. ఎలాగూ పేదరికాన్ని నిర్మూలించలేరు. పేదల్ని నిర్మూలిస్తారేమో, నవ్వొచ్చింది.

-ఇక నుంచి ఒక్కరైతు కూడా ఆత్మహత్య చేసుకోకుండా చూస్తా- మంత్రి. రేపీ పాటికి మరో నలుగురైదుగురు రైతులు ఆత్మహత్య చేసుకుంటూనే ఉంటారు.

-ప్రజల కోసమే రాజకీయాల్లోకి వచ్చాను. ప్రజల కోసం నా ప్రాణాలైనా అర్పిస్తాను. - ఓ నాయకుడు. పార్టీలో చేరేటప్పటికి పూరిగుడిసె, ఇప్పుడు పెద్ద బంగ్లా. అదంతా ప్రజల కోసమే మరి! తన అభివృద్ధి కోసం ఎన్ని ప్రాణాలనైనా తీయడానికి వెనుదీయని నాయకుడు.

- ఎదురు కాల్పుల్లో నలుగురు నక్సలైట్లు మృతి- పోలీసులు. కాల్పులు నక్సలైట్లే ముందు ప్రారంభించినా పోలీసులకు ఒక్క తూటా కూడా తగలదు.

- రెండు మతాలకు చెందిన వ్యక్తుల మధ్య కొట్లాట. ముగ్గురి పరిస్థితి ఆందోళనకరం. మతాలే నాయకుల శ్వాస కదా మరి!

- కిరోసిన్ పోసుకుని అగ్నికి ఆహుతైన అబల - భర్తా, అత్తా మామలే కారణమంటున్న మహిళా సంఘాలు. నెల తిరిగేలోగా వాడికి మరో పెళ్ళి జరగుతుంది.

యింకా ఏవేవో వార్తలు.

దర్టీ పేపర్. అన్నీ ఇలాంటివే వార్తలు. కాకపోతే ప్రాంతాల పేర్లలో. వ్యక్తుల పేర్లలో మార్పులుంటాయి అంతే!

ఒక్క వార్తకు కూడా మనసుండదు. ఒక్క మనసుకూ వార్తుండదు. పొడిపొడి వార్తలు. తడిలేని వార్తలు. బుర్రంతా గజిబిజి. ఎక్కడెక్కడో తెగుతూ ముడిబడుతూ, ముడిబడి తెగుతూ జ్ఞాపకాలు.

పేపరు వార్తలకు లాగానే మనుషుల మధ్య సంబంధాలు కూడా అంతగా కదిలించడం లేదు. మనుషులని బట్టి పేపర్లు. పేపర్లను బట్టి మనుషులు.

పాచి నోరుతో నాయకులు ఏవేవో మాట్లాడుతూనే ఉంటారు. వాటికోసం మనం లొట్టలు వేసుకొని పేపర్ల కోసం ఎదురు చూస్తూనే ఉంటాం.

రొటీన్.... రొటీన్.. యాంత్రికం... యాంత్రికం..! వార్తలంటే రాజకీయ వార్తలేనా? ఆటలంటే క్రికెట్టేనా? ఈ పత్రికల వాళ్ళకు మరేం కనిపించవా?

ప్రజల జీవితం దిగజారడానికి రాజకీయ పరిస్థితులే కారణమంటాడు మధుసూదనం. కాదు, ఈ దుస్థితికి ఆర్థిక దివాళాకోరుతనమే కారణం అంటుంది నా శ్రీమతి.

మనసంతా గజిబిజి ఆలోచనలు. అంతా అయోమయం. గందరగోళం. మనసే కాదు బజారులో కూడా ఏదో గందరగోళంగా ఉన్నట్లుగా అనిపించింది. మనసూ బజారు రెండూ ఒకలాగే అనిపించింది.

పేపరు నన్ను మరోపేజీకి తిరగేస్తుంది. సరిగ్గా అప్పుడే నా శ్రీమతి సనుక్కుంటూనో, గొనుక్కుంటూనో వచ్చి నా ప్రక్కన నిలబడింది. "నీకసలు మతి ఉందా? బజారు బజారంతా గోలగోలగా ఉంటే నువ్వేమో తాపీగా పేపరు చదువుతున్నావా? ఏమీ పనిలేదు. డ్యూటీ డ్యూటీ... తప్పితే ఏవేవో పుస్తకాలు చదవడం. పైగా ఆనందమో విషాదమో తెలియని ఫీలింగు... ఏం చేతనవుద్దీ? గొర్రెతోక బెత్తెడు అన్నట్లు ఎదుగు బొదుగూ లేని సంసారం. ఛీ పాడు బతుకు. నన్ను బావిలోకి తోసేసి కూర్చున్నారు నా పుట్టింటివాళ్ళు" కాస్త గొంతులో జీర.

"మనకు దేనికీ ఇబ్బంది లేదు కదా. ఎందుకీ ఏడుపు. ఉన్న దాంతో తృప్తిగా, ఆనందంగా బ్రతకలేవూ" కంఠం బాగా తగ్గించుకునే అన్నాను.

"బాగా తిన్నది అరక్క నాకీ ఏడుపు. సరేగాని ముందు బయటికి వెళ్ళి ఊళ్ళో వాళ్ళంతా ఎక్కడికి పరుగు తీస్తున్నారో తెలుసుకో పో... వెళ్ళూ వెళ్ళు" అంది. చేతిలోని పేపరు గుంజి టేబుల్‌మీద పడవేసి మళ్ళీ అరిచింది.

బయటకు నడవక తప్పింది కాదు. ఒంటినీ, మనసునీ విరుచుకొని బయటకు నడిచాను.

జనం! జనం!! జనం!!!

రోడ్డు నిండా జనం!

పరుగెత్తే జనం!

పరుగెత్తుతూ జనం తీస్తున్న మొస్స తాలూకు శబ్దాలు. అసహనపు నిట్టూర్పులు. ఆయాసపు పరుగులు. రోడ్డంతా జనం ఉన్నా ఎవరికి ఎవరూ సంబంధం లేనట్లుగానే పరుగు తీస్తున్నారు.

సమూహంలోని ఒంటిరివాళ్ళు.

అసలెందుకు పరుగు తీస్తున్నట్లు? ఎక్కడికో?

పరుగెత్తే జనంలో నాయకులు ఉన్నారు. కూలీలూ, వ్యాపారులు ఉన్నారు. అధికార్లు, అనుచరులూ ఉన్నారు. కవులూ, రైతులూ, కళాకారులూ ఉన్నారు. స్త్రీలూ పురుషులూ ఉన్నారు. బంధువులూ, రక్త సంబంధీకులూ, స్నేహితులూ, పరిచయస్తులూ ఉన్నారు. అయినా ఎవరికి ఎవరూ ఏమీ కానట్లు ఉరుకుతున్నారు. కేవలం ఒక్క పరుగుతోనే వారికి సంబంధమున్నట్లుగా.

ఒక్కొక్కరి శరీరాలు చమటతో తడిచి ఉన్నాయి. వేలాది పాములు ఒక్క చోట చేరి బుసలు కొడుతున్నట్లు మొస్స... మొస్స..

చాలాసేపు అలాగే నిలబడి చూస్తున్నాను. ఒక్కరు కూడా నన్ను గనించడంలేదు. ఓ చిన్న చిరునవ్వైనా నవ్వడంలేదు. పరిచయస్తులు కూడా అపరిచయస్తుల్లా వెళ్తున్నారు. ఒకరిద్దర్ని మందలించినా తమను కాదన్నట్లుగా వెళ్ళిపోతూనే ఉన్నారు.

తెలుసుకోవాలి వీళ్ళు ఎక్కడకు పరుగెత్తుతున్నారో. తెలుసు కోవాలి. అదుగో రాజయ్య సారు ఇటే వస్తున్నాడు. అడగాలి. అదుగో దగ్గరవుతున్నాడు.

"సార్... ఓ రాజయ్యసార్! ఎక్కడకు వెళ్తున్నారు సార్? సార్... సా... ర్... !"

ముక్కుతో పీల్చుకుంటున్న గాలి సరిపోవడం లేదేమో నోరుకూడ తెరుచుకొని కష్టంగా గాలి పీల్చుకుంటూ ఎగపోసుకుంటూ సాగిపోతున్నాడు. చూసీ చూడనట్లుగా ముందుకు సాగిపోతూ ఉన్నాడు.

మనుషులకింత చులకనతనం పనికిరాదు.

అదుగో ము... కుం.. దం..

ఆс వాడు ముకుందమే. పొట్టిగా పెద్దపొట్టతో అచ్చు గున్నఏనుగులా ఎంత వయ్యారంగా వస్తున్నాడో! అడుగు తీసి అడుగు వేస్తున్నపుడు లయబద్ధంగా ఊగుతున్న వాడి పొట్ట. వాడి పరుగును చూస్తే నవ్వొస్తుంది.

"ముకుందం! ఒరే ముకుందం! ఎక్కడికి వెళ్తున్నారు మీరంతా?" మధ్యలోనే నవ్వును మానుకొని వాడి దారిన వాడు వగరుస్తూ పరుగెత్తినట్లుగా పరుగెత్తుతున్నాడు. వీడి దుంప తెగా!

రోడ్డు నిండా పరుగెత్తుతున్న వాళ్ళను చూస్తుంటే సరదాగా ఉంది. అయ్యో పాపం! ఎవరో ఒకతను పడిపోయాడు. ఒకరి కాళ్ళలో ఒకరి కాళ్ళు పడడం మూలంగా పడ్డాడు. ఒక్కపలుచని ఆ వ్యక్తి తిడుతున్నాడు. తను పడటానికి కారణమైన వాడు మాత్రం ఆగలేదు. పైగా కిందపడిన వాడు తిడుతున్న మాటలను పట్టించుకోకుండా పరుగెడుతూనే ఉన్నాడు.

## ఉగాది కవిత

మధుర రసాల సాల నవపల్లవముల నారగించి
పిక గణంబులు తమ కంఠంబుల సవరించి
పంచమ స్వరమున పాడదొడగె

ఇక్షుచాపము నెక్కిబెట్టి మరుడు
విరిశరముల గురిపింపగ
సమ్మోహనంగా పుడమియంతా
సుమవల్లీ కుటీరంబుగా మారిపోయె

నవనవోత్ఫుల్ల సుమ మకరందపానమత్త
మధుపంబుల సంగీత విశేషంబుల
సన్నాయిల సందడు లలరె

రమణీయ సీతాకోక చిలుకల సుమభ్రమణము
రంగురంగుల రెక్కల పుష్పభ్రాంతి నొసగ
అవనినంతయు హరితజాలము ఆహ్లాదకరంబుగ
ఆవహించె

చైతన్యోద్దీపిత భావంబుల కలకలములు
సరస సల్లాప భావనల మధురిమలు
మానవాళికి మనోల్లాసంబు నొసగె

అత్యంత మనోహరమీ నవ వసంతము
జగదభినవ సౌభాగ్య దీప్త విభవము
ఇది వసుధ యొనరించిన పుణ్యతపః ఫలము!

– బాణగిరి వసుంధర

అతన్ని లేపాలనే స్పృహకూడా లేదు.

పడిపోయిన వాడు మొస్సతో ఏదోఏదో తిడుతూనే లేచాడు. మోకాళ్ళు పగిలి రక్తం కారుతుంది. అతను అదేమీ పట్టించుకోలేదు. కాని తనని పడవేసి పరుగుతీస్తున్న వాడి వెనకాల ఆవేశంతో పరుగుతీస్తున్నాడు. అతనిలో కసి అంతకంతకూ పెరుగుతుంది.

వాడి బాధల్లా ఒక్కటే! తాను లేచేటప్పటికి ఎంతో మంది తనను దాటి వెళ్ళారని. తన కోపమల్లా ఒక్కటే. తనని పడవేసి వాడిపైన కక్షతీర్చుకోవాలని.

పరుగును వేగం చేశాడు. పడవేసినవాడు ఎంతకూ అందటం లేదు. లోపల కసి, ఆవేశమూ ఎక్కువౌతుంది. ఐనా అతన్ని అందుకోలేక పోతున్నాడు. దబుక్కున ప్రక్కనే పరుగెత్తుతున్న మరొకడ్ని పడదోశాడు. అలా తనకు అందిన వారినందరినీ పడవేస్తూ వెళ్తున్నాడు. కింద పడిపోతున్న వాళ్ళసంఖ్య ఎక్కువ అవుతున్న కొద్దీ వాడిలో ఆనందం పెరుగుతోంది.

ప్రస్తుతం అందిన వాళ్ళందరినీ పడవేయడమే వాడి పని. అడ్డదార్లో నైనా ముందుకు వెళ్ళడమే వాడి ధ్యేయం.

ఎక్కడికీ పరుగు? ఎవరూ చెప్పరేం?

ఎవరికి ఎవరూ ఏమీ కాని ఈ పరుగు పందెం సందడిలో అక్కాచెల్లెళ్ళైన సౌజన్య, కల్పనతోపాటు వారి స్నేహితురాలు మౌనిక కూడా రావడం ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ఆశ్చర్యం ఎందుకంటే కలిసి మెలిసి పరుగెత్తుకు వస్తున్నారు వారు. వాళ్ళను చూస్తే మనుషుల్లో మానవత్వం యింకా చావలేదని పిస్తుంది.

పరుగెడుతూ పరుగెడుతూ కల్పన అకస్మాత్తుగా పడిపోయింది. చీర కుచ్చిళ్ళు కాళ్ళకింద పడటం మూలంగా ఈ ప్రమాదం జరిగింది. సుతిమెత్తని ఆమె పెదవి రోడ్డుకు తగలి రక్తం స్రవిస్తోంది. మోకాళ్ళూ, మోచేతులూ కొట్టుకుపోయాయి. ప్రక్కనే పరుగెత్తుతున్న సౌజన్య ఆగలేదు. పరుగెడుతూనే కుచ్చిళ్ళు సరిగా చెక్కుకోనందుకు తిడుతోంది. త్వరగా లేచి రమ్మంటోంది. కనీసం వెనక్కి తిరిగి కూడ చూడకుండానే.

కాస్త వెనకగా వస్తున్న మౌనిక, పడిపోయిన కల్పనను తొక్కకుండా తప్పించుకోబోయింది. అటుగా వస్తున్న మరో వ్యక్తి భుజం తగలడంతో ఆమె పాదాలు కల్పన వీపుపై పడకుండా నిరోధించలేక పోయింది.

కల్పన బాధగా మూలిగింది.

మౌనికకు కాస్త జాలిలాంటి భావనేదో కలిగి– "సారీ కల్పనా... లే... లే... త్వరగా లేచిరా! మీ అక్క చాలా ముందుకు వెళ్ళింది. నేను వెళ్తున్నా. ఆలస్యం చేయకు త్వరగా రా!" అంటూంది. తాను మాత్రం ఆగలేదు. ఈలోగా కొన్ని పాదాలు కల్పనపై పడనే పడ్డాయి. మానవత్వం జిందాబాద్! పరుగు పందెం వర్ధిల్లాలి!!!

అందరిదీ ముందుచూపే. అందరిదీ పై చూపే. అందరి లక్ష్యమూ ఒక్కటే. తనకంటే ముందు వాడిని దాటెయ్యాలని, అందరి ధ్యేయమూ ఒక్కటే. తానే ముందుండాలని.

అయ్యో పాపం కల్పన! ఆమెను ఎవరూ పట్టించుకోవడంలేదు. వెళ్ళి రక్షించాలి! లేకపోతే కాస్తంతలో కొద్ది పాటి ప్రమాదమే తప్పింది. కల్పనను ఎలా రక్షించగలను?

ఎవరి పరుగు వారిది. పరుగెత్తే వారు ఆగరు. లేపరు. కనీసం ఓ జాలిచూపయినా చూడరు. నేనేమో వెళ్ళలేను. ఎలా?

గాడ్ ఈజ్ గ్రేట్. కల్పన బాధని పండ్లకింద బిగబట్టుకొని, చీరను మోకాళ్ళపైకి జరుపుకొని గాయంపై ఊదుకుంది. మెల్లగా పరుగెత్తడం మొదలుపెట్టింది. ఆమె అందమైన శరీరం కర్కశమైన పాదాల కిందపడి నలగకుండా రక్షించబడినందుకు తృప్తిగా కళ్ళుమూసుకున్నాను.

ఇంత మంది ఇన్ని కష్టాలను ఓర్చుకుంటూ, తన వాళ్ళను సైతం పట్టించుకోకుండా, ప్రాణాలను లక్ష్యపెట్టకుండా పరుగెత్తుతున్నారంటే ఏదో గొప్ప కార్యమే అయ్యుంటుంది.

ముందు ఈ విషయమేదో తెల్సుకోవాలి... తప్పక తెల్సుకోవాలి!

అదుగో సుందరం వస్తున్నాడు. కొద్ది వెనకాలే అక్బరూ వస్తున్నాడు. వాళ్లిద్దరూ మంచి మిత్రులు. నాకు బాగా పరిచయస్తులు.

అక్బరు కోసం సుందరం చూడటంలేదు. సుందరాన్ని చేరుకోవాలని అక్బరు తెగ ఆయాసపడుతున్నాడు. ఆయాసంతో పరుగెత్తుతున్నాడు కనుక ఆయన మాట్లాడే మాటలు అస్పష్టంగా వినబడుతున్నాయి... ఈ ఇద్దరిలో ఎవరో ఒకర్ని అడిగి తెల్సుకోవాలి. సుందరం రోడ్డుకు కాస్త ప్రక్కగానే వస్తున్నాడు. బలవంతంగా ఆపి అయినా విషయం తెల్సుకోవాల్సిందే.

సుందరం దగ్గరవుతున్నాడు.

వెనుక ఆయాసంతో బలాన్ని పుంజుకుంటూ అక్బరు.

సుందరం నా సమీపానికి వచ్చేలోపునే దబేలున కింద పడ్డాడు. కింద పడలేదు. అక్బరే కింద పడేశాడు. పడేసి మీద కూర్చుని ఆయాసపడుతూ "ఓరే సుందరం నీకు దండం పెడతారా! ఎక్కడికి వెళ్తున్నారో, ఎందుకు వెళుతున్నావో చెప్పరా ప్లీజ్..." అంటున్నాడు.

సుందరంలో పరుగు తాలూకు ఆయాసం, అక్బర్ చర్యవల్ల చిరాకూ కలిగింది. ఒక్క ఉదుటున అక్బరును ప్రక్కకు తోసేసి పరుగందుకొని– "అక్బర్! ఎందుకో, ఎక్కడి వరకో నాకూ తెలియదు. ముందు వెళ్ళేవాళ్ళను ఎవరినైనా అడుగుదాం.. కమాన్" అంటూ వెళ్తున్నాడు. వెనకాలే అక్బరు కూడా.

ఎంత విచిత్రం! ఎక్కడికో తెలియకుండానే పరుగెత్తుతున్నారా?... వీళ్ళ ఇద్దరికే తెలియదా? లేకా ఎవ్వరికీ తెలియదా?

మొత్తానికి ఈ సంఘటన చూశాక ఈ పరుగు గురించి తెలుసుకోవాలనే ఆసక్తి చచ్చిపోయింది. అనవసరంగా చాలా సమయాన్ని ఇక్కడ వృధా పరిచాను.

## కవిత హృదయం

అలరించిన
పులకింతల హేల
కవిత హృది
  అలవోకగా
  అక్షరాల పరుగు
  మంచి కవిత్వం
జపాను బొమ్మ
హైకూకి కొలతలు
ఐదేడయిదు
  మానసోల్లాస
  మనోజ్ఞ పరిమళం
  కవితా రామం
వస్తువేదైనా
కవిత మధురమే
మది స్పందిస్తే

–గణపతిరాజు నరసింహరాజు

ఎంచక్కా ఏ రమణజీవో, వద్దెర చండీదాసో, చలమో, ఇస్మాయిల్‌తోనే హాయిగా గడపాల్సిన క్షణాలు బుగ్గిపాలు అయ్యాయి.

ఎలాగూ ఆఫీసు టయిమయింది. వెనుదిరక్క తప్పదు కదాని అనుకుంటుండగానే ఒక్కసారిగా నన్నెవరో రోడ్డు మీదకు నెట్టారు. కింద పడబోయి తమాయించుకొని ప్రమాదం నుండి బయటపడేసరికే నడిరోడ్డు మీద ఉన్నాను. ఆగితే ప్రమాదం. కల్పనకు పట్టిన గతే నాకూ పడుతుంది. ఇక పరుగెత్తక తప్పదు. మెల్లగా ప్రారంభించాను. అబ్బ ఎంత మంది! ముసలి వాళ్ళూ, పిల్లలుకూడా ఎంత బాగా పరుగెత్తుతున్నారో! అమ్మో... నన్ను దాటేస్తున్నారు. వేగం పెంచాలి... ఆఁ ఒక్కరు, ఇద్దర్ని దాటగలిగాను. ఆగకూడదు. అందర్నీ దాటెయ్యాలి. వేగం పెంచాలి.

ఇలా ఎంత దూరం? ఎంత కాలం? అసలెందుకు?

జీవితమంతా ఇలా పరుగెత్తాల్సిందేనా?

అదుగో... నేను ఆలోచిస్తుంటే ఎలా దాటిపోతున్నారో! అందుకే వేగం అందుకున్నాను.కాని ఏం లాభం. కాళ్ళు గుంజుతున్నాయి. కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. ఒళ్ళంతా చమటతో తడిసి ముద్దయింది. నా వల్ల కాదు. నేను పరుగెత్తలేను. హే భగవాన్!

ఈ జీవితం నా వల్ల కాదు. నెమ్మదిగా రోడ్డుప్రక్కకు తప్పుకోవాలి. కొద్ది కొద్దిగా రోడ్డు వారగా వస్తున్నాను. అడుగులు కూడా అధీనంలో లేవు.

విచిత్రమేమిటంటే రోడ్డు ప్రక్కన నా శ్రీమతి కూడా నన్ను గమనిస్తూనే పరుగు తీస్తూంది.

'ఏమండీ! ఈ బతుకు మీ వల్ల కాదు.. ఇంత కష్టం వద్దు బయటకు రండీ...? అని అంటుందేమో అని పక్కకు రాబోయాను.

కాని ఆమె – "రావద్దూ... బయటకు రావద్దూ... అప్పుడే అంత ఆయాస పడుతున్నారేం?... అదుగో మీరు బయటకు రాబోతున్నారు! వస్తే నేను మళ్ళీ నెట్టేస్తాను జాగ్రత్త..." అంటుంది. గుండె గుభిల్లుమంది.

ప్రస్తుతానికి బయటకు వెళ్ళడమే ప్రమాదం. అందుకే మళ్ళీ రోడ్డుపైకి జరిగాను. మళ్ళీ పరుగు.

అదుగో నన్ను దాటేస్తున్నారు. పరుగెత్తాలి. తప్పదు... త... ప్పు... దు....

ఎక్కడికో తెలియకపోయినా, ఎందుకో తెలియకపోయినా, ఈ పరుగును ఎలా ఆపనూ? ■